క్లుప్తంగా

పీయూ వీసీని కలిసిన ప్రిన్సిపల్



జడ్చర్ల టౌన్: పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసులును శుక్రవారం జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డా. సుకన్య కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తమ కళాశాలకు అటానమస్ హోదా లభించిందని, కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి సహకరించాలని వీసీ కోరారు. కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని విన్నవించారు. అందుకు వీసీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.శ్రీనివాసులు, అధ్యాపకులు ఇన్నారెడ్డి, సులేమాన్, రాఘవేంద్రరెడ్డిలు పాల్గొన్నారు.

రామేశ్వరానంద సమారాధన



జడ్చర్ల టౌన్: మండలంలోని గొల్లపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై లలితాంబికా తపోవన వ్యవస్థాపకులు రామేశ్వరానంద పుణ్యసమారాధన వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ముందుగా రామేశ్వరానంద విగ్రహానికి పంచామృతాభిషేకం చేసి నూతన వస్త్రాలు, పూలతో అలంకరించారు. అనంతరం అన్నదానం చేశారు. సమారాధన వేడుకలకు రామేశ్వరానంద శిష్యులు, భక్తబృందంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్ గ్రామ సమీపంలో దుందుభీ వాగు నుంచి శుక్రవారం ఉదయం అనుమతి లేకుండా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహాధర్నాకు వెళ్లిన మున్సిపల్ కార్మికులు



జడ్చర్ల టౌన్: చలో హైదరాబాద్ పేరుతో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన మహాధర్నాకు శుక్రవారం జడ్చర్ల మున్సిపల్ కార్మికులు బయలుదేరి వెళ్లారు.

కొనసాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ రెన్యూవల్

నవాబుపేట: మండలంలో గ్రామాల్లో ఉన్న ఖాలీ స్థలాల్లో గతంలో తీసుకున్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు రెన్యూవల్ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో 354 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఉన్నట్లు సమాచారం. దీంతో అన్ని గ్రామాల్లో రెన్యూవల్స్ పూర్తి చేసినా మండల కేంద్రంలో ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఇతర గ్రామాల పంచాయతీ అధికారులతో కలిసి రెన్యూవల్ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. నెలాఖరుకు వంద శాతం ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేయాల్సి ఉండగా, మండల కేంద్రం మినహా అన్ని గ్రామాలు పూర్తి చేశారు. మూడేళ్ల క్రితం ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఇంటి ఖాళీస్థలం(కాలి ప్లాట్) ఉన్న వారు వేయి రూపాయలు చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని తాజాగా అధికారులు రెన్యూవల్ చేస్తున్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం పలువురు దంపతులు అమ్మవారికి అర్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన, సహస్ర లలితా పారాయణం, పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.

27న హ్యాండ్‌బాల్ క్రీడలు

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఈనెల 27 హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలికల ఎంపిక నిర్వహిస్తున్నట్లు పీఈటీ శంకర్‌నాయక్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని బాలికలు క్రీడల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



కొంరెడ్డిపల్లి-షేక్‌పల్లి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- రాకపోకలకు మరింత సౌకర్యం
- మత్స్యకారుల అభ్యున్నతికి కృషి
- ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

గండీడ్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు కార్యక్రమాలకు వారు హాజరయ్యారు. కొంరెడ్డిపల్లి నుంచి హన్వాడ మండలం షేక్‌పల్లి వరకు రూ.3.45 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారు. గండీడ్ మండల కేంద్రంలో రూ.6.2 కోట్లతో కస్తూర్బా పాఠశాల నూతన భవన నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. సల్కర్‌పేట్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. అనంతరం వెన్నాచేడ్ పెద్ద చెరువులో, సాలార్‌నగర్ ప్రాజెక్టులో ఉచిత చేపపిల్లలను వదిలారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. రవాణా వసతి మెరుగు పర్చేందుకు బీటీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. గండీడ్‌లో కేజీబీవీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశం, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, పిషరీష్ ఏడీ రాధారోహిణి, ఆర్‌అండ్‌బీ డీఈఈ సంధ్య, ఎంపీడీఓ దేవన్న, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గండీడ్, మహమ్మదాబాద్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, నారాయణ, పీసీసీ మెంబర్ నరసింహారావు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆశిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మత్స్యసహకార సంఘాల అధ్యక్షులు గోపాల్, నారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ బాలస్వామి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



ఎంపీడీఓ, ఎంపీఓలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీడీఓ, ఎంపీఓ, టెక్నికల్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు గత ఆర్థిక సంవత్సరంలో రూ. 46 కోట్ల ఉపాధి పనులు చేయగా, ఈ ఆర్థిక సంవత్సరం రూ.32 కోట్ల మేరకు పనులు పూర్తైనట్లు అధికారులు వివరించారు. ఉపాధి హామీ పథకంలో నిధుల పరిమితి ఉండబోదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎక్కువ నిధులు వచ్చేలా బడ్జెట్‌ను రూపొందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్‌ను ఉపయోగించుకుని నిర్మాణాత్మకమైన పనులు చేపట్టాలని, గిరిజన పంచాయతీల్లో జీపీ భవనాలను నిర్మించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. బాలానగర్‌లో ఉపాధి నిధులతో నిర్మించిన వైకుంఠధామాన్ని కూల్చేశారని, ఫోర్‌మెన్ అధికారుల కమిటీ ధ్రువీకరించినా వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు చేపట్టాలన్నారు.

కాలుష్య పరిశ్రమలపై స్పీకర్‌కు ఫిర్యాదు

పోలేపల్లి సెజ్‌లోని కాలుష్య పరిశ్రమలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలను తమ పంట పొలాల్లోకి వదలడం వల్ల పంటలు పండడం లేదన్నారు. పశువులు, గేదెలు మృత్యువాత పడుతున్నాయని పోలేపల్లికి చెందిన రఘునందనాచారి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన తాను ఈ విషయంపై ఇప్పటికే అసెంబ్లీలో మాట్లాడానని, సాక్షిలో పలుసార్లు కథనాలు కూడా వచ్చాయన్నారు. అయినా సంబంధిత అధికారులు స్పందించక పోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రయోగాల ద్వారా పాఠ్యాంశాల బోధన



మాట్లాడుతున్న ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సైన్స్ టీచర్లు ప్రయోగాల ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తే విద్యార్థులకు బాగా అర్థమవుతుందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) దుంకుడు శ్రీనివాస్ అన్నారు. ఇటీవల పదోన్నతి పొందిన 88 మంది సైన్స్ టీచర్లకు విద్యాశాఖ, పిల్లలమర్రి జిల్లా సైన్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం స్థానిక మహాత్మా గాంధీ రోడ్ హైస్కూల్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో సమర్థవంతంగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో డీఎస్‌ఓ శ్రీనివాస్, సైన్స్ అకాడమీ ఆర్గనైజర్లు స్రవంతి, సత్యానంద్, అమీర్, రేవతి, పిల్లలమర్రి జిల్లా సైన్స్ ఫోరం అధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి శంషీర్, సభ్యులు ఆనంద్, రాములు, సాయిబాబు, శ్రీహరి, అరుణమ్మ, బషీర్ అహ్మద్, లక్ష్మి పాల్గొన్నారు.

స్కాలర్ షిప్‌ల కోసం కలెక్టర్‌కు వినతి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్కాలర్‌షిప్‌లు రాక పోవడంతో కాలేజీ ఫీజుల కోసం యాజమాన్యం తమపై వత్తిడి తెస్తోందని నవోదయ నర్సింగ్‌కాలేజీ విద్యార్థులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం సమర్పించారు. కాలేజీలో జీఎన్‌ఎం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరైన స్కాలర్‌షిప్‌లు కాలేజీ యాజమన్యం అకౌంట్‌లో పడకపోవడంతో ఫీజుల కోసం తమను వేధిస్తున్నారని వాపోయారు. ఈనెల 28న పరీక్ష ఫీజు చివరి అవకాశం ఉండగా, తమ తల్లిదండ్రులు కాలేజీ ఫీజు మొత్తం చెల్లించాల్సిందిగా వత్తిడి తెస్తున్నారన్నారు. కాలేజీ యాజమాన్యంతో మాట్లాడి పరీక్ష ఫీజు కట్టించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దు



జానంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: రైతులు వరి ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూచించారు. మూసాపేట మండలంలోని జానంపేట, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. క్వింటాలుకు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం రైతులకు అందజేస్తోందని, దీనివల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లర్లు, గోదాముల వద్ద ఎలాంటి సమస్య ఏర్పడినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. గన్నీ బ్యాగుల కొరత రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, తోట శ్రీహరి, బగ్గి కృష్ణయ్య, నిరంజన్, బాలరాజు ఉన్నారు.

హక్కుల సాధనకు ఏకం కావాలి



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న టీఎన్‌జీఓ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం ఏకం కావాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో జరిగిన పంచాయతీ కార్యదర్శుల ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు టీఎన్‌జీఓ ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. ఏ ఒక్క ఉద్యోగికి ఏ కష్టం వచ్చినా టీఎన్‌జీఓ వారి పక్షాన పోరాటం చేస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామ పాలన పూర్తిగా వారి చేతుల్లోనే ఉంటుందన్నారు. గ్రామ పరిపాలనలో కార్యదర్శుల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రనాయక్, కోశాధికారి కృష్ణమోహన్, డీటీ దేవేందర్, బాబురావు, పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, రఘుపతిరెడ్డి తదితులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్

తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం (టీఎన్‌జీఓ అనుబంధం) జిల్లా నూతన కమిటీని టీఎన్‌జీఓ భవన్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.జ్ఞానేశ్వర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కృష్ణనాయక్, ఉపాధ్యక్షులుగా రవీందర్‌రెడ్డి, నర్సింహులు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా వి. రవికుమార్, జాయింట్ సెక్రటరీగా శ్వేత, కోశాధికారిగా కృష్ణయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.సతీష్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా కె. శ్రీకాంత్, సభ్యులుగా మోహన్‌బాబు, సుభద్ర ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను టీఎన్‌జీఓ నాయకులు సన్మానించారు.

ఒకరిపై కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని కన్మనూర్ గ్రామానికి చెందిన వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నెపురెడ్డి గురువారం రాత్రి ఇంటి వద్ద ఉండగా, అదే గ్రామానికి చెందిన తాజ్ అనే వ్యక్తి రెండు, మూడు సార్లు ఇంటి చుట్టు తిరిగాడు. దీంతో రాత్రిపూట ఇక్కడ ఏం చేస్తున్నావని మన్నెపురెడ్డి ప్రశ్నించడంతో తాజ్ అతడిని తిడుతూ కర్రతో దాడి చేశాడు. దీంతో మన్నెపురెడ్డి తలకు గాయం కావడంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో తాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆయుర్వేదంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శైలజారెడ్డి

దేవరకద్ర: జాతీయ ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద డాక్టర్ శైలజారెడ్డి మాట్లాడుతూ ఆయుర్వేద మొక్కలలో ఎన్నో ఔషధగుణాలు కలిగి ఉంటాయని, అన్ని రకాల వ్యాధులకు, దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యం పని చేస్తుందన్నారు. దీనివల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవన్నారు. ప్రతి విద్యార్థి ఆయుర్వేద మొక్కలు, వైద్యం గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద సిబ్బంది ఆంజనేయులు, ఫార్మసిస్టు అనిత, హెచ్‌ఎమ్ జి. ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వృద్ధులకు చికిత్స అందించాలి

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో 60ఏళ్ల పైబడిన వృద్ధులకు ప్రత్యేక గదిలో చికిత్సలు అందించాలని సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. ఫోరం తరుపున ఆయనను పుష్పగుచ్ఛం అందించారు. సీనియర్ సిటిజన్స్‌కు ప్రతి మంగళ, గురువారాల్లో ప్రత్యేక గదిలో చికిత్సలు నిర్వహిస్తున్నామని, వారికి ప్రత్యేక ఫిజియోథెరపీ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, కార్యదర్శి నాగభూషణం, అక్కినేని నారాయణరావు, రాజసింహుడు పాల్గొన్నారు.

నల్లా బిల్లుల వసూలుపై బీఆర్‌ఎస్ నిరసన



భూత్పూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

భూత్పూర్: మున్సిపాలిటీలో ఇంటి యజమానుల నుంచి నల్లా బిల్లుల వసూళ్లను నిరసిస్తూ శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. మూడేళ్ల నుంచి బకాయి ఉన్న నల్లా బిల్లులు ఇంటి యజమానుల నుంచి వసూలు చేయడం తగదని, నల్లా బిల్లులు చెల్లించమని వారు అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి ఉచితంగా నీరందిస్తే నీటి బిల్లు వేయడం తగదన్నారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ శంకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, కౌన్సిలర్లు, బాల్‌కోటీ, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, మురళీధర్ గౌడ్, సత్యనారాయణ, మైనార్టీ నేత మహ్మద్ సాదిక్, వెంకట్ రాజు, అజీజ్, జాకీర్, సత్యనారాయణ, యాదయ్య, తిరుపతయ్యగౌడ్ పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాసిరకం భోజనం

- సిబ్బందిని నిలదీసిన తల్లిదండ్రులు, గిరిజన నాయకులు
- అందుబాటులో లేని వార్డెన్



విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన నాయకులు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని.. నీళ్ల చారు ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని విద్యార్థులకు తల్లిదండ్రులకు ఫిర్యా దు చేశారు. దీంతో శుక్రవారం వారు గిరిజన నాయకులతో కలిసి పాఠశాలకు చేరుకొన్నారు. వార్డెన్ అందబాటులో లేకపోవడంతో సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. రోజు కూరగాయలు లేకుండా పప్పు చారు వడ్డిస్తే పిల్లలు ఎలా తింటారని నిలదీశారు. బోధన కూడా సరిగా అందడం లేదని.. చదువులో వెనుకబడిపోతున్నామని విద్యార్థులు వివరించారు. టాయిలెట్స్ కూడా శుభ్రంగా లేవని.. వార్డెన్ ఇవేమీ పట్టించుకోరని తెలిపారు. స్టోర్ రూంలోకి వెళ్లి చూడగా పుచ్చుబట్టిన కూరగాయాలు, నాసిరకమైన శనగలు, ఇతర సామగ్రి కనిపించడంతో ఇలాంటి వాటితో వంట చేస్తే విద్యార్థులు అనారోగ్యం బారిన పడతారని వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ పద్మను ఫోన్‌లో వివరణ కోరగా.. వర్కర్లు సరిపడా లేనందున కొన్ని పొరపాట్లు జరిగాయని, మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తామని చెప్పారు. బోధన కూడా సరిగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గీత, చంపాబాయి, ఫాల్గుణ, బాషా నాయక్, పాండు తదితరులు పాల్గొన్నారు.



నిలువెత్తు సొరకాయ..

సాధారణంగా సొరకాయ సుమారు రెండు నుంచి రెండున్నర ఫీట్ల పొడవు ఉంటుంది. కాని ఈ సొరకాయ మాత్రం ఏకంగా ఐదు ఫీట్ల పొడవు ఉంది. మండలంలోని కంచన్‌పల్లికి చెందిన ఓ మహిళా రైతు తమ ఇంటి వద్ద కాసిన సొరకాయలను విక్రయించేందుకు మండల కేంద్రానికి తీసుకొచ్చింది. బృందావన్ హోటల్ యజమాని వినోద్ రూ.50కి కొనుగోలు దీనిని చేశారు.

– మహమ్మదాబాద్

గొర్రెల పరిశోధన కేంద్రాన్ని కాపాడుకుందాం



శాస్త్రవేత్త అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఓయూ జేఏసీ నాయకులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): మహబూబ్‌నగర్ పట్టణంలోని బండమీదిపల్లిలో 1953లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం 353 ఎకరాలతో కూడిన గొర్రెల పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని ఓయూ జేఏసీ నాయకులు కొంగల పాండు, వెంకటేష్, తైద శ్రీనివాస్, బోయ రాములు, ప్రవీణ్‌యాదవ్‌లు తెలిపారు. శుక్రవారం పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్త అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గొర్రెల పరిశోధనకు అనుకూలమైన భూమిని అప్పటి ప్రభుత్వం దక్షిణ తెలంగాణకు అందించి గొర్రెల కాపరుల జీవితాలలో వెలుగులు నింపిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో 20 ఎకరాలు జిల్లా కోర్టుకు, భూత్పూర్ నుంచి చించోలి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గొర్రెల పరిశోధన కేంద్రం భూమిని రహదారి నిర్మాణానికి కేటాయించారని తెలిపారు. గొర్రెల పరిశోధన కేంద్రం పాలమూరు జిల్లాకే తలమానికమని, పాలమూరులో నల్లజాతి గొర్రెలు నల్లమల మేకలు సమృద్ధిగా లభిస్తాయని, వాటి పరిరక్షణ మీదనే ఉందన్నారు. ఇక్కడి గొర్రెలకాపరులకు మంద బలంగా పెరగడానికి పరిశోధన కేంద్రం నుంచి ఇత్తనపు పొట్టేళ్లు, మేక పోతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కల్పించుకొని రైతుల, గొర్రెలకాపర్ల, ప్రజలు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశోధన కేంద్రాన్ని కాపాడాలని కోరారు.

సీతమ్మతండాలో తాగునీటి కటకట



తాగునీటి కోసం బోరు వద్ద గుమికూడిన సీతమ్మతండా గిరిజనులు

నవాబుపేట: యన్మన్‌గండ్ల పంచాయతీ పరిధిలోని సీతమ్మతండాలో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో బోర్లపై ఆధారపడి కాలం గడుపుతున్నట్లు తెలిపారు. అన్నితండాలకు నీళ్లు ఉన్నా సీతమ్మతండాకు మాత్రం తాగునీటి కోసం ట్యాంకు నిర్మించినా భగీరథ నీరు రావటం లేదు. అధికారులు మాత్రం ట్యాంకుకు నీరు ఎక్కడం లేదని చెబుతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులను వివరణ కోరగా ట్యాకుకు భగీరథ పైప్ లైన్ నుంచి నీరు ఎక్కడం లేదని, ట్యాంకు చాలా ఎత్తులో ఉండటంతో సమస్య వచ్చిందని పేర్కొన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి తండా ప్రజలకు నీరందిస్తామన్నారు.

మాలల ఆత్మగౌరవ సభకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహయ్య

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 27న నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభకు మాలలు పెద్దఎత్తున తరలిరావాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగడ్డ యాదయ్య, జాతీయ మాలల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంచిమి లక్ష్మణ్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రులతో కూడిన సబ్ కమిటీని, ఏక్ కమిషన్ కమిటీని వెంటనే రద్దు చేయాలన్నారు. మందకృష్ణమాదిగ తెలంగాణ రాష్ట్రంలో మాలలు లేరనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, నాగర్‌కర్నూల్‌లో జరిగే సభ ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నటువంటి మాలల శక్తి ప్రదర్శన నిరూపిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు చెన్నయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.